# ఘల్లు ఘల్లు మని.. చినుకే చేరగా!

★ చిరుజల్లులతో పులకించిన పుడమి ★ చిగురించిన రైతుల ఆశలు ★ వ్యవసాయ పనుల్లో నిమగ్నం


వర్షం కురవడంతో నారు వేసేందుకు పొలాన్ని చదును చేస్తున్న రైతు


ప్రాణం పోసుకుంటున్న వరి నారుమడులు


మాడ్గులలో ఎరువులు చల్లుతున్న వ్యవసాయ కూలీలు

**వికారాబాద్, ప్రభాతవార్త : ఘల్లు ఘల్లు మని సిరి మువ్వల్లే చినుకే చేరగా..ఝుల్లు ఝుల్లు మని పులకింతల్లో పుడమే పాడగా..** సినిమా పాటను తలపించేలా, వానదేవుడు కరుణించడంతో నేలతల్లి పరవశించిపోతోంది. గత రెండు మూడు రోజులుగా వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షాలు కురవడంతో ఎండిపోతున్న పంటలకు జీవం పోసినట్లయింది. దీంతో అన్నదాతల కళ్ళల్లో ఆనందం వెల్లువిరిసింది. వారం రోజుల క్రితం వరకు వర్షాలు లేక పంటలు ఎండు ముఖం పట్టడంతో రైతులు ఆందోళన చెందారు. గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, కప్ప జాతరలు నిర్వహిస్తూ ఆకాశం వైపు ఆశగా చూశారు. అన్నదాతల మొక్కులు ఆలకించిన వరుణుడు కరుణించడంతో పొలాల్లో పచ్చదనం మళ్ళీ సంతరించుకుంది. ప్రస్తుతం రైతులు ఎరువులు చల్లడం, పొలం పనుల్లో ముమ్మరంగా నిమగ్నమయ్యారు.

మంగళవారం రాత్రి జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షం కురిసింది. వికారాబాద్ (23 మి.మీ), కోట్‌పల్లి (22.8 మి.మీ), ధారూరు (22.6 మి.మీ)లలో అత్యధిక వర్షపాతం నమోదవ్వగా.. పూడూరు (18.3 మి.మీ), మోమిన్‌పేట్ (17.3 మి.మీ), బంట్వారం (16.4 మి.మీ), నవాబుపేట్ (13.7 మి.మీ), తాండూరు (12.8 మి.మీ) వర్షం పడింది. జిల్లాలో ఇప్పటి వరకు 245.4 మి.మీ సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, ఇప్పటివరకు 155.8 మి.మీ నమోదైంది.

**ఆగస్టు, సెప్టెంబర్‌పైనే ఆశలు**

అల్పపీడన ప్రభావంతో రానున్న రెండు రోజుల్లో మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఎల్నీనా ప్రభావంతో వర్షాలు తగ్గుతాయన్న భయాలు ఉన్నప్పటికీ, వచ్చే ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వర్షాలు సమృద్ధిగా కురిస్తేనే భూగర్భ జలాలు పెరిగి, ఖరీఫ్ సీజన్ గట్టెక్కుతుందని రైతులు భావిస్తున్నారు.

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త



## మమ్మల్ని విస్మరించడం న్యాయమేనా!

✦ఎమ్మెల్యే మల్లారెడ్డిపై పార్టీలో తిరుగుబాటు స్వరం ✦కలకలం సృష్టిస్తున్న కార్యకర్త రక్తంతో రాసిన లేఖ

**మేడ్చల్, జులై 22. ప్రభాతవార్త :** మేడ్చల్ రాజకీయాల్లో సంచలన పరిణామం చోటుచేసుకుంది. ఎమ్మెల్యే మల్లారెడ్డిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఓ బీఆర్ఎస్ కార్యకర్త రక్తంతో బహిరంగ లేఖ రాయడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. పార్టీ పట్ల నిబద్ధత కలిగిన కార్యకర్తల మనోభావాలను ఈ లేఖ ప్రతిబింబిస్తోందంటూ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. పార్టీ కష్టకాలంలో కార్యకర్తలకు అండగా నిలవాల్సిన నాయకత్వం అందుబాటులో లేకపోవడం, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండడం, అధికార కాంగ్రెస్ నేతలతో సన్నిహితంగా కనిపించడం వంటి అంశాలపై ఆ కార్యకర్త తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అధికారం ఉన్నప్పుడు కార్యకర్తలతో ఉండి, అధికారం కోల్పోయిన తర్వాత వారిని విస్మరించడం న్యాయమేనా అంటూ లేఖలో ప్రశ్నించాడు. మల్లారెడ్డి తన విద్యాసంస్థల ఉద్యోగులకు ఇచ్చే ప్రాధాన్యం కూడా పార్టీ కోసం శ్రమించిన కార్యకర్తలకు ఇవ్వడం లేదని లేఖలో ఆరోపించాడు. ఎన్నో సంవత్సరాలుగా పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారిని పట్టించుకోకుండా, వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని లేఖలో విమర్శించాడు. >>3

## సిఎం టూర్ సక్సెస్

**సమర్థవంతంగా బందోబస్తు నిర్వహించారు**

**పోలీసు సిబ్బంది, అధికారులకు ఎస్‌పి అభినందన**


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ స్నేహ మెహ్రా

**వికారాబాద్, ప్రభాతవార్త :** జిల్లాలోని కొడంగల్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పర్యటన విజయవంతం కావడంతో పోలీసు బందోబస్తు సమర్థవంతంగా నిర్వహించిన పోలీసు అధికారులకు, సిబ్బందికి జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా అభినందనలు తెలిపారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల, హకీంపేట్ ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ హబ్ పనులను పరిశీలించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించేందుకు విచ్చేసిన సీఎం రేవంత్ రెడ్డి పర్యటన విజయవంతంగా ముగిసిందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా బందోబస్తు విధుల్లో పాల్గొన్న అదనపు ఎస్పీ రాజేశ్ మీనా, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీసు కానిస్టేబుళ్లు, మహిళా పోలీసు సిబ్బంది, హోంగార్డులు, ప్రత్యేక బలగాల సిబ్బందిని హృదయ పూర్వకంగా అభినందించారు. వికారాబాద్ జిల్లా పోలీసు సిబ్బందితో పాటు వనపర్తి, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారా యణపేట, సంగారెడ్డి, గద్వాల్ జిల్లాల నుండి వచ్చిన పోలీసు బలగాలు సమన్వయంతో విధులు నిర్వహించి, సిఎం పర్యటనలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసు కోకుండా విజయవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారన్నారు.

# నా పునాది కొడంగల్

## మీ ఆశీర్వాదంతోనే ఈ స్థాయికి వచ్చా..



- రోజుకు 18 గంటలు కష్టపడుతున్నా సమయం చాలడంలేదు
- నేరుగా ఎదుర్కొనలేక దొంగ దెబ్బకు కుట్ర
- కాపాడుకునే బాధ్యత మీదే
- నూరుశాతం ఓట్ల నమోదు చేయించేంత వరకు విశ్రమించవద్దు
- బూత్ లెవల్ ఏజెంట్లకు సిఎం రేవంత్ పిలుపు

**కొడంగల్, జులై 22, ప్రభాతవార్త :** "కొడంగల్ నా జన్మభూమి.. మీ ఆశీర్వాదమే నన్ను ఇక్కడివరకు తెచ్చింది. బిఆర్ఎస్, బిజెపిలు ఒకటై...నాతో ఎదురుగా వచ్చి పోరాడే ధైర్యం లేక, దొంగదెబ్బ తీయాలని చూస్తున్నాయి. రేవంత్ రెడ్డిని రాష్ట్రస్థాయిలో దెబ్బతీయాలంటే, ముందుగా కొడంగల్ అనే పునాదిని దెబ్బతీస్తే, నన్ను ఆపవచ్చని కొందరు కుట్రలు చేస్తున్నారు. ఇంట్లో పొగబెడితే రేవంత్ రెడ్డి బయటకు రాకుండా ఉంటాడని భావిస్తున్నారు. నన్ను గెలిపించిన నా కొడంగల్ గడ్డను, నా ప్రజలను కాపాడుకునే బాధ్యత మీదే" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావోద్వేగంతో కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. బుధవారం వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో తన స్వగృహంలో ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)ప్రక్రియపై కొడంగల్ నియోజకవర్గ స్థాయి ఏజెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో మన ఉనికికి, హక్కులకు నిదర్శనం ఓటు అని, ఓటు హక్కు లేకపోతే ఆ మనిషి జీవచ్ఛవంతో సమానమని ఆవేదన వ్యక్తం చేశారు.

**కొడంగల్‌లో ఇంకా 22 శాతం నమోదు పెండింగ్**

'119 నియోజకవర్గాల సంక్షేమం కోసం రోజుకు 18 గంటలు పనిచేస్తున్నా నాకు సమయం సరిపోవడం లేదని, ఈ సమయంలో కొడంగల్‌లో కుట్రలు చేసేవారికి తగిన బుద్ధి చెప్పే బాధ్యత మీపైనే ఉంది. కొడంగల్ నియోజకవర్గంలో ఇంకా 22 శాతం (సుమారు 54,635) మంది ఓట్ల నమోదు జరగలేదని, వారి వివరాలు నమోదు చేయకపోతే ప్రమాదం పొంచి ఉంది.


సర్ ప్రక్రియపై కొడంగల్ నియోజకవర్గ స్థాయి ఏజెంట్ల సమావేశంలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

**ఓట్లు గల్లంతు కాకుండా కాపలా కాయాలి**

ఒక కార్యకర్తగా ప్రతి ఇంటికీ వెళ్ళి ఓటరు వెరిఫికేషన్ పూర్తి చేయించాలి. ఓటు లేకపోతే పేదలు ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలను కోల్పోతారు. వలస వెళ్ళిన కుటుంబాలను గుర్తించి, అర్హత ఉన్న ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించేంత వరకు విశ్రమించవద్దు. బూత్ స్థాయి ఏజెంట్లు, నాయకులు శ్రద్ధ వహించి అర్హత ఉన్న ఏ ఒక్కరి ఓటు పోకుండా చూసుకోవాలి' అని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఓటర్ల వివరాలు ఎన్నికల అధికారులకు అందించాల్సిన బాధ్యత బూత్ లెవల్ ఏజెంట్లపైనే ఉందన్నారు. ఈ కార్యక్రమలో శాసనసభ్యులు టీ.రామ్మోహన్‌రెడ్డి, బుయ్యాని మనోహర్‌రెడ్డి, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత, డిసిసి అధ్యక్షులు జాదవ్‌ధారాసింగ్ నాయక్, ప్రశాంత్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేష్‌రెడ్డి, వార్ల విజయ్‌కుమార్, మున్సిపాలిటీల చైర్మన్ నందారం ప్రశాంత్, నాగులపల్లి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల గొంతు నొక్కడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు

**నీట్ పేపర్ లీక్‌పై కేంద్రం సమాధానం చెప్పాలి**

**యువత విశ్వాసాన్ని నిలబెట్టండి: మంత్రి శ్రీధర్‌బాబు**

**రంగారెడ్డి అర్బన్, జులై 22, ప్రభాతవార్త :** విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, నీట్ పరీక్ష ప్రశ్నపత్రం లీక్ వంటి ఘటనలు దేశ విద్యా వ్యవస్థపై విద్యార్థులు, తల్లిదండ్రుల నమ్మకాన్ని దెబ్బతీశాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విమర్శించారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం చర్లపటేల్‌గూడలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్ గురుకుల విద్యాసంస్థలో నిర్వహించిన ఛాత్రోన్‌కి గూంజ్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థుల తరఫున గళమెత్తుతూ ప్రధానమంత్రి నివాసం వద్ద నిరసన తెలిపిన ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై పోలీసులు వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. ప్రజాస్వామ్యంలో విద్యార్థుల సమస్యలను ప్రస్తావించడం నేరం కాదని, వారి గొంతుకను అణచివేసే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు. యువత విశ్వాసాన్ని నిలబెట్టాలంటే పరీక్షల నిర్వహణలో అత్యాధునిక భద్రతా ప్రమాణాలు అమలు చేయడంతో పాటు, పేపర్ లీక్‌లకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ గురుకుల విద్యాసంస్థలను దేశంలోనే ఆదర్శవంతమైన విద్యా కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయిస్తోందని తెలిపారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు నాణ్యమైన విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం


చర్లపటేల్‌గూడ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో నిర్వహించిన ఛాత్రోన్‌కి గూంజ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంత్రి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి, నీట్ పరీక్ష, పేపర్ లీక్‌లు, పోటీ పరీక్షల నిర్వహణ, విద్యార్థులు ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడి తదితర అంశాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. విద్యార్థులు తమ సందేహాలు, సమస్యలు, సూచనలను మంత్రికి వివరించగా, వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేని తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా కదంతొక్కిన కాంగ్రెస్ 4లో





కొడంగల్‌లో సిఎం రేవంత్ ధర్నాకు హాజరై నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ శ్రేణులు, విద్యార్థులు

## ఊరు చుట్టూ కంచె వేశారు..

**మా బతుకుదెరువు పోతోంది - మంత్రి శ్రీధర్‌బాబుకు ఫార్మా బాధిత రైతుల మొర**

**యాచారం, జులై 22, ప్రభాతవార్త :** మేడిపల్లి, నానక్ నగర్, తాటిపర్తి, కురుమిద్ద తండాలలో భూములు ఇవ్వని రైతులతో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ భవన్‌లో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో బుధవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి శ్రీధర్ బాబుకు తమ సమస్యలు పరిష్కారం చేయాలని నాలుగు గ్రామాల రైతులు మొరపెట్టుకున్నారు. గత ప్రభుత్వం బలవంతంగాను, రైతులతో ఎలాంటి చర్చలు జరపకుండా భూములను ఇష్టం ఉన్నట్లు నోటిఫికేషన్లు జారీ చేసిందన్నారు. పలుమార్లు గ్రామస్తులతో రైతులతో నాటి ప్రభుత్వానికి అభ్యంతరాలు తెలిపినా స్పందించలేదన్నారు. రైతుల భూములన్నిటిని కాపాడతామని గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గుర్తు చేశారు. .తాటిపర్తి, నానక్ నగర్ గ్రామాలకు రెవెన్యూ భూమి మిగలకుండా గ్రామం చుట్టు కంచె వేసారని ఆవేదన వ్యక్తంచేశారు. భవిష్యత్తులో రైతులు, కూలీలు, కులవృత్తుల వారి జీవనోపాధి దెబ్బతింటుందన్నారు. ప్రతి గ్రామానికి కొంత రెవెన్యూ మిగిలేలా ఉండాలని కోరారు. నానక్ నగర్ మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి తాటిపర్తి మాజీ సర్పంచ్ దూస రమేష్ తదితరులు పాల్గొన్నారు.




## డంపింగ్ యార్డ్‌కు ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలిస్తున్నాం

**షాద్‌నగర్, జులై 22, ప్రభాతవార్త :** సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటు అంశంపై జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి డంపింగ్ యార్డ్ వ్యతిరేక కమిటీ జేఏసీ సభ్యులతో సుదీర్ఘంగా చర్చించారు. ప్రజల అభ్యంతరాలు, స్థానిక పరిస్థితులను పరిశీలించి ప్రత్యామ్నాయ మార్గాలను చూస్తున్నట్లు కలెక్టర్ సూచనప్రాయంగా వెల్లడించినట్లు మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి తెలిపారు. దీంతో సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ అంశంలో సానుకూల పరిణామాలు చోటుచేసుకుంటాయనే ఆశాభావం వ్యక్తమవుతోంది. డంపింగ్ యార్డ్‌ను అంగీకరించే ప్రసక్తే లేదుసిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటు నిర్ణయాన్ని ప్రజలు, కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించే ప్రసక్తే లేదని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణం, వ్యవసాయం, భూగర్భ జలాలను కాపాడేందుకు ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి అధికారికంగా ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కలెక్టర్‌ను కోరారు. తొలుత సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డ్ వల్ల కలిగే దుష్ఫలితాలను వివరిస్తూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డికి ప్రజెంటేషన్ ఇచ్చి వినతిపత్రం అందజేశారు.

## మిత్రులమైన మమ్మల్నే అరెస్ట్ చేస్తారా?

**సిపిఐ నేతల ఆవేదన**

**కొడంగల్ రూరల్, జులై 22 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డికి బుధవారం కొడంగల్‌లో వినతి పత్రం అందించేందుకు వెళ్తున్న సీపీఐ పార్టీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేయడం సరైంది కాదని పార్టీ నియోజకవర్గ కార్యదర్శి ఎండీ మైమూద్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో పోలీసులు ముందస్తుగా సీపీఐ నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌లో బంధించడం సరైంది కాదన్నారు. రాబోయే రోజుల్లో అధికార పార్టీకి సీపీఐ మిత్ర పక్షంగా కొడంగల్‌లో భావించదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పార్టీ జిల్లా మాజీ కార్యదర్శి ఇందనూర్ బషీర్, నారాయణపేట జిల్లా సీపీఐ పార్టీ సహాయ కార్యదర్శి శ్రీనివాసులు, వివిధ మండలాల కార్యదర్శులు శ్యామ్‌సుందర్, సురేశ్‌గౌడ్, మల్లప్ప, లక్ష్మణ్, మూతుల రాజు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎండీ.రహీం, మాజీ సర్పంచ్ సున్నపు వెంకటప్ప, బాలప్ప, గుండప్ప, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.


నిందితుడు రంగయ్య

## ఆక్సిటోసిస్ ఇంజక్షన్ల విక్రేత అరెస్ట్

**ఘట్‌కేసర్ రూరల్, జులై 22, ప్రభాతవార్త:** పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మక్త గ్రామంలో ఎస్‌వోటీ ఉప్పల్ పోలీస్ బృందం దాడులు నిర్వహించి ఐదు ఆక్సిటోసిస్ ఇంజక్షన్ల సీసాలను స్వాధీనం చేసుకున్న సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పాలు ఉత్పత్తి చేయడానికి పాలిచ్చే పశువులపై ఉపయోగించే ఆక్సిటోసిస్ ఇంజక్షన్ల తయారీతో పాటు అమ్మకాలను ప్రభుత్వం నిషేధించింది. ఈ ఇంజక్షన్ల వలన పశువులతో పాటు ఆ పాలు తాగే మనుషులపై దుష్ప్రభావాలు కలుగుతాయి. ప్రభుత్వం నిషేధించినటువంటి ఆక్సిటోసిస్ ఇంజక్షన్లను తయారు చేసి విక్రయిస్తున్న మక్తకు చెందిన ముంత రంగయ్య యాదవ్ (56 )పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితుడి వద్ద నుండి ఐదు ఆక్సిటోసిస్ ఇంజక్షన్లను ఉప్పల్ ఎస్‌వోటీ పోలీసులు స్వాధీనం చేసుకుని పోచారం ఐటీ కారిడార్ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోచారం ఐటీ కారిడార్ పోలీసులు తెలిపారు.

## గోశాలలో నిర్లక్ష్యం: రెండు ఆవులు మృత్యువాత

**షాద్‌నగర్, జులై 22, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణ శివారులోని చౌడమ్మ గుట్ట ఆంజనేయస్వామి దేవాలయ గోశాలలో ఘోరం జరిగింది. రెండు పశువుల కళేబరాలు గోశాలలో గడ్డి కింద ఉన్నాయి. అవి ఎప్పుడు మరణించాయో తెలియదు. ఓ భక్తుడు స్వామివారిని దర్శించి గోమాతల వద్దకు ప్రసాదం పెట్టడానికి వెళ్లడంతో ఈ విషయం వెలుగుచూసింది. మూగజీవాల ఆలనా పాలన చూసుకోవాల్సిన నిర్వాహకుల నిర్లక్ష్యంపై నిర్వాహకుల పనితీరును ప్రశ్నిస్తూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## షాద్‌నగర్ చౌరస్తా విస్తరణకు ప్రతిపాదనలు

**షాద్‌నగర్, జులై 22, ప్రభాతవార్త :** షాద్‌నగర్ పట్టణంలోని ప్రధాన చౌరస్తా విస్తరణకు ఎట్టకేలకు కదలిక మొదలైంది. చౌరస్తా విస్తరణకు సంబంధించి మున్సిపల్ కార్యాలయంలో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వివిధ వర్గాల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించారు. ఆర్డీవో సరిత, మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ మోహన్, కమిషనర్ సునీతా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గండిపేట జలాశయంలో వరుణ జపం



**మొయినాబాద్, జులై 22, ప్రభాతవార్త :** రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని చిలుకూరు శ్రీ బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకులు రంగరాజన్ ఆకాంక్షించారు. గత కొద్ది రోజులుగా రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో, మంచి వర్షాలు కురవాలని కోరుతూ మంగళవారం గండిపేట (ఉస్మాన్ సాగర్) జలాశయంలో ప్రత్యేక వరుణ జపం నిర్వహించారు. రంగరాజన్ ఆధ్వర్యంలో వేద పండితులు జలాశయంలో నిలబడి వేద మంత్రోచ్ఛరణల మధ్య వరుణ దేవునికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

## వికారాబాద్‌కు ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ

♦సిఎం చేతుల మీదుగా ఉత్తర్వు కాపీలు అందుకున్న యాజమాన్యం ♦దుద్యాల పరిసరాలలో ఏర్పాట్లు ♦30 ఎకరాల భూములు కేటాయించిన ప్రభుత్వం ♦జిల్లాలో 4,200 ఎకరాలలో సాగు ♦1,326 మంది రైతులకు మార్కెటింగ్ సౌకర్యం

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** ఆయిల్‌పామ్ రైతులకు మంచి రోజులు రానున్నాయి. జిల్లాలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నెలకొల్పనున్నారు. కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల పరిసరాలలో చురుకగా సాగుతున్న బహుళ విధ పారిశ్రామిక వాడలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ కూడా రానున్నది. 'ఎకో పామ్ ఆయిల్ అండ్ ఫ్యాట్స్ ప్రైవేట్ లిమిటెడ్' ఈ ఫ్యాక్టరీ స్థాపనకు ముందుకు వచ్చింది. అందుకు అనుగుణంగా ప్రభుత్వం సంబంధిత పరిశ్రమ స్థాపనకు 30 ఎకరాల భూములు కేటాయించింది. సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఉత్తర్వు కాపీలను సంస్థకు అందజేశారు. గత మూడేళ్లుగా ఉద్యానవనశాఖ అధికారులు జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగును ప్రోత్సహిస్తున్నారు. పామాయిల్ ఫ్యాక్టరీ కూడా అందుబాటులోకి రావడం పట్ల రైతాంగానికి మేలు చేకూరుతుందని అంటున్నారు. పామాయిల్ పరిశ్రమ పనులు వేగమంతంగా పూర్తి చేసుకుని రైతులకు సౌకర్యవంతంగా మారుతుందని విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. రైతులకు అవగాహన కూడా కల్పించారు. దానివల్ల రైతులు ఈ పంట సాగుపై మొగ్గ చూపిస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం 1,326 మంది రైతులు 4,200 ఎకరాలలో సాగు చేస్తుండటం గమనార్హం. దీనికి 90 శాతం మొక్కలపై సబ్సిడీ లభిస్తోంది. జిల్లాలోనే ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కావడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. రైతులు పండించే ఫ్రెష్ ఫ్రూట్ బంచ్ (ఎఫ్ఎఫ్‌బీ)లు సకాలంలో కొనుగోలు చేసేందుకు ఫ్యాక్టరీ యాజమాన్యం ముందుకు వస్తోంది. రవాణా వ్యయం తగ్గి పంట నాణ్యత కాపాడేందుకు వీలవుతుంది. రైతులకు అందుబాటులోకి మార్కెట్ సౌకర్యం, సకాలంలో కొనుగోలు ప్రక్రియ, సకాలంలో రైతులకు చెల్లింపులు జరుగనున్నాయి.


పంట సాగును పర్యవేక్షిస్తున్న మంత్రి తుమ్మల(ఫైల్)



నిరహార దీక్ష ప్రదేశంలో పోలీసులు ఏసిపి కేవీపీ రాజు, సిఐ నందీశ్వర్ రెడ్డి

### 2013 చట్టం ప్రకారం పరిహారం చెల్లించకుంటే హైకోర్టును ఆశ్రయిస్తాం

**యాచారం, జులై 22, ప్రభాతవార్త :** యాచారం మండలం పరిధిలోని మొండిగౌరెల్లి గ్రామంలో ప్రతిపాదిత పారిశ్రామిక పార్కు కోసం చేపడుతున్న భూ సేకరణలో తీవ్ర అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ తెలంగాణ రాష్ట్ర భూముల పరిరక్షణ సమితి అధ్యక్షులు గోడుకొండ్ల ప్రవీణ్ చేపట్టిన నిరాహార దీక్ష బుధవారానికి మూడవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా దీక్షా శిబిరానికి గ్రామ ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి పూర్తి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా గోడుకొండ్ల ప్రవీణ్ మాట్లాడుతూ... "సర్వే నంబర్లు 19, 68, 127లలోని 677.29 ఎకరాల భూమి సేకరణ ప్రక్రియలో అధికారులు రైతుల అభిప్రాయాలను ఏమాత్రం పట్టించుకోకుండా ఏకపక్షంగా వ్యవహరించారు. రికార్డు భూములు మరియు దశాబ్దాలుగా రైతులు సాగు చేసుకుంటున్న కబ్జా భూములకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం, ప్రస్తుత నూతన మార్కెట్ విలువను బట్టి పరిహారం చెల్లించాలి. రెవెన్యూ అధికారులు, కొంతమంది స్థానిక నాయకులు కుమ్మక్కై రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. చట్టాలను అమలు చేయనప్పుడు వాటిని రూపొందించడం ఎందుకు?" అని ప్రశ్నించారు. రైతులకు న్యాయమైన నష్టపరిహారం చెల్లించకపోతే బాధితులతో కలిసి హైకోర్టును ఆశ్రయిస్తామని ఆయన స్పష్టం చేశారు. సమాచారం అందుకున్న ఇబ్రహీంపట్నం ఏసీపీ కేవీపీ రాజు, యాచారం సీఐ, ఎస్ఐలతో కలిసి దీక్షా శిబిరాన్ని సందర్శించారు. రైతులు, నాయకుల సమస్యలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్న ఏసీపీ, సమస్యల పరిష్కారానికి తన వంతుగా అధికారులతో మాట్లాడి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రైతులకు పూర్తి న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగేది లేదని సమితి నాయకులు తేల్చిచెప్పారు.

### యాచారం సర్పంచ్ ఫోరం అధ్యక్షుడిగా అరవింద్ నాయక్

**యాచారం, జులై22, ప్రభాతవార్త :** యాచారం మండలం సర్పంచ్ ఫోరం మండల కార్యవర్గాన్ని బుధవారం మేడిపల్లిలో నిర్వహించిన సర్పంచ్ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొర్ర అరవింద్ నాయక్ (మంతన్ గౌరెల్లి), ఉపాధ్యక్షులుగా నీలం శ్రీవిద్య (కురుమిద్ద), 2. అంబోజి రమేష్ (తులేకుర్ద్), ప్రధాన కార్యదర్శిగా దేరంగుల శంకర్, (మల్కీజ్ గూడ) గౌరవ ఆధ్యక్షులుగా.. ముచ్చర్ల సుగుణ సంపత్, (నకర్త మేడిపల్లి) కార్యదర్శులుగా బోడ కృష్ణ (సింగారం), కిషన్ నాయక్ (నల్లవెల్లి) కోశాధికారిగా రమేష్ నాయక్ (కేసీ తండా), సహాయ కార్యదర్శిగా తొట్ట రమేష్ (చింతపట్ల), కార్యవర్గ సభ్యులుగా.. అనిత శరణం (యాచారం), ఝాన్సీ రమేష్ (తాడిపత్రి) చైతన్య రాజు (నానక్ నగర్), వెన్నెల శేఖర్ (కొత్తపల్లి) ఈ కార్యక్రమంలో సర్పంచ్లు విజయకుమార్, బెల్లీ అశోక్, నక్క అలివేలు వెంకటేష్, రాజు, మంగా జంగయ్య, కౌసల్య జగదీష్, తదితరులు పాల్గొన్నారు.



నూతన సర్పంచ్‌ల సంఘం కార్యవర్గం ఎన్నికైన సర్పంచులు

### విద్యుత్ స్తంభాలను తాకరాదు

**జిల్లేడు చౌదరి గూడెం, జులై22, ప్రభాతవార్త :** మండలంలో వర్షాలు కురుస్తుండడం వలన ప్రజలు గ్రామాలలో గల విద్యుత్ స్తంభాలను తాకరాదని ఏఈ నర్సింలు తెలిపారు. వర్షాలు కురుస్తుండడం వలన విద్యుత్ స్తంభాలకు షాక్ వచ్చే ప్రమాదం ఉందని ఆయన అన్నారు. విద్యుత్ వైర్ల నుంచి స్తంభాలకు ప్రమాదం పొంచి ఉందని ఆయన తెలిపారు. గ్రామాలలోని ప్రజలు అప్రమత్తంగా ఉండి విద్యుత్ స్తంభాలకు షాపు వస్తే విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు. ప్రజలు నేరుగా వెళ్లి మరమ్మత్తులు చేసే ప్రయత్నాలు చేయవద్దని ఆయన సూచించారు.

### ఇళ్ల పట్టాలు ఉన్నవారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు ఇవ్వాలి

**శామీర్‌పేట, జులై 22, ప్రభాతవార్త:**
ఉప్పరిపల్లి గ్రామంలో గతంలో ఇళ్ల పట్టాలు పొంది ఉన్న వారికి సుమారు 300మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు ఇవ్వాలని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని శామీర్‌పేట ఉమ్మడి మండల మాజీ జడ్పీటిసి పి. బాలేశ్ కలిసి వినతిపత్రం అందజేసి కోరారు. బుధవారం శామీర్‌పేట మండలంలోని ఉప్పరిపల్లి గ్రామంలో ఇళ్ల పట్టాలు ఉన్న వారి ప్లాట్ల విషయంపై హైకోర్టు ఇచ్చిన తీర్పును గాంధీభవన్‌లో జరిగిన ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వివరించినట్లు మంత్రి సానుకూలంగ స్పందించారని శామీర్‌పేట ఉమ్మడి మండల మాజీ జడ్పీటిసి పి. బాలేశ్ తెలిపారు. ఉప్పరిపల్లి గ్రామానికి చెందిన పేద ప్రజలకు 2003 సంవత్సరంలో గతంలో ఉన్న అప్పటి టిడిపి ప్రభుత్వం ఇళ్లపట్టాలు పేదలకు ఇవ్వటం జరిగిందని ఔటర్



నగరంలోని గాంధీభవన్‌లో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి ఉప్పరిపల్లిలో ఇళ్ల పట్టాలు ఉన్న వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు ఇవ్వాలని కోరిన శామీర్‌పేట ఉమ్మడి మండల మాజీ జడ్పీటిసి పి.బాలేశ్ దృశ్యం

రింగురోడ్డు నిర్మాణం సమస్యతో పెండింగ్‌లో పడినట్లు ఇళ్లపట్టాలు ఉన్న వారికి న్యాయం చేయాలని హైకోర్టును ఆశ్రయించినట్లు ఇళ్లపట్టాలు ఉన్న వారికి అనుకూలంగ తీర్పు వచ్చిందని అమలు చేయాలని ఇళ్లపట్టాలు ఉన్న వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని మంత్రిని కోరటం జరిగిందని మంత్రి శ్రీనివాస్‌రెడ్డి సానుకూలంగ స్పందించారని మాజీ జడ్పీటిసి పి. బాలేశ్ తెలిపారు. ఇళ్లపట్టాలు ఉంటే ఇళ్లు నిర్మించుకోవచ్చని చెప్పారని ఆయన తెలిపారు. ఇళ్ల పట్టాలు ఉన్న ఉప్పరిపల్లి పేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని మంత్రిని మాజీ జడ్పీటిసి పి. బాలేశ్ కోరారు.

### సర్‌లో ఒక్క ఓటు కూడా పోకుండా నమోదు చేయించాలి

**ఘట్‌కేసర్, జులై 22, ప్రభాతవార్త:** ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణలో ప్రక్రియలో ఒక్క ఓటు కూడా పోకుండా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని మేడ్చల్ డిసిసి ఉపాధ్యక్షులు వేముల మహేశ్ గౌడ్ అన్నారు. ఎంఎంసి ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు సామల అమరేందర్ అధ్యక్షతన 7వ డివిజన్ కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. డిసిసి వీపి మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ సర్ ప్రక్రియ ముగిసే వరకు ప్రతి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, బిఎల్‌ఏలతో సమన్వయం చేసుకొని డివిజన్ పరిధిలో ఒక్క ఓటు కూడా పోకుండా ఎమ్యూనరేషన్ ఫారం నింపి బిఎల్‌ఓలకు అందజేయాలని సూచించారు. రాబోయే ఎంఎంసి ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని ప్రజాప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు తెలియజేయాలని పేర్కొన్నారు. డివిజన్ అధ్యక్షులు సామల అమరేందర్ మాట్లాడుతూ సర్ ప్రక్రియలో బిఎల్‌ఓలకు సహకరిస్తున్న బిఎల్‌ఏలకు కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై విశ్వాసంతో డివిజన్ అధ్యక్ష బాధ్యతలు అప్పగించారని పార్టీ ఆదేశాల మేరకు కార్యక్రమాలు, సమావేశాలు అందరి సహకారంతో నిర్వహిస్తామని పేర్కొన్నారు.

## రాహుల్ గాంధీ అరెస్టుపై కడ్తాల్‌లో భారీ ర్యాలీ, ధర్నా



.. పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**కడ్తాల్, జులై 22, ప్రభాతవార్త :** ఢిల్లీలో ప్రతిపక్ష నేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసిన ఘటనను నిరసిస్తూ కడ్తాల్ పట్టణంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కడ్తాల్ పట్టణంలో హైదరాబాద్ శ్రీశైలం జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా చేశారు. ధర్నా సందర్భంగా కార్యకర్తలు రాహుల్ గాంధీ జిందాబాద్..మోదీ సర్కార్ దౌర్జన్యం ఆపండి ప్రజాస్వామ్యాన్ని కాపాడండి బీజేపీ దిగిపో అంటూ నినాదాలు చేశారు. కాంగ్రెస్ జెండాలతో ర్యాలీగా వెళ్లారు. ఈ ధర్నా కారణంగా కొద్దిసేపు శ్రీశైలం హైవే పై వాహనాలకు అంతరాయం కలిగింది.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష గొంతును అణచివేయాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఇది దుర్మార్గపు చర్య. దీన్ని కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీలో ప్రధాని నివాసం దగ్గర విద్యార్థులపై జరిగిన పోలీసు దాడిని ఖండిస్తూ రాహుల్ గాంధీ శాంతియుత ధర్నా చేస్తుండగా ఆయన్ని అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యానికి పెద్ద మచ్చ అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యుడు అయిళ్ళ శ్రీనివాస్ గౌడ్, డిసిసి ఉపాధ్యక్షుడు గుదురు శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోతుగంటి శంకర్, మాడుగుల కాంగ్రెస్ అధ్యక్షుడు కిషన్ రెడ్డి, సీనియర్ నాయకులు బిక్యా నాయక్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అశోక్, ఉప సర్పంచుల సంఘం అధ్యక్షుడు లక్పతి నాయక్, టౌన్ అధ్యక్షుడు మాలే మల్లేష్ గౌడ్, సర్పంచి బిక్షపతి, నాయకులు అంజయ్య గుప్తా, రామకృష్ణ, జగన్ గౌడ్, వేణు గోపాల్, జావర్ లాల్, హీరా సింగ్, జహంగీర్ అలీ, సత్యం యాదవ్, ఇమ్రాన్ బాబా, రాజేష్, శ్రీనివాస్, రామచందర్ నాయక్, నరేందర్, దేవ్ సింగ్, జనార్ధన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోంది

**యాలాల జులై 22, ప్రభాతవార్త :** నీట్ పేపర్ లీకేజీ వ్యవహానికి భాధ్యత వహిస్తూ దేశ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తమ పదవులకు రాజీనామా చేయాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహార్‌రెడ్డి డిమాండ్ చేశారు. విద్యార్థులకు మద్దతుగా నిలిచిన రాహూల్ గాంధీ పట్ల పోలీసులు అమానుషంగా వ్యవహారించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. పోలీసుల తీరు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఆయన వ్యాఖ్యానించారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి భాద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుదవారం యాలాల మండల కాంగ్రేస్ పార్టీ ఆద్వర్యంలో లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాలో ధర్నా రాస్తా రోకో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మనోహార్‌రెడ్డి ముఖ్య అథితిగా పాల్గొని ప్రసంగించారు. నీట్ పేపర్ లీకెజిఈ కారణంగా ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనం అయ్యిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. లీక్‌కు బాధ్యత వహిస్తూ ప్రధాని, విద్యాశాక మంత్రులు రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కష్ట పడి చదువుకున్న విద్యార్థులకు పేపర్ లీక్‌తో భవిష్యత్తు తలకిందులయ్యిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులకు అండగా నిలిచిన కాంగ్రేస్ నేత రాహూల్ గాంధీపై పోలీసులు అమానుషంగా వ్యవహారించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కాంగ్రేస్ పార్టీ విద్యార్థులకు అండగా ఉంటుందని ఆయన తెలిపారు. పేపర్ లీక్ వ్యవహారంపై పార్లమెంటులో చర్చ జరపాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని బుయ్యని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రేస్ పార్టీ శ్రేణులు, చైర్మన్లు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



:లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

## బిజెపి నిరంకుశపాలనకు రాహుల్‌గాంధి అరెస్టు నిదర్శనం

**ఆమనగల్లు, జులై16, ప్రభాతవార్త:** కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం నిరంకుశపాలన సాగిస్తుందని, కాంగ్రేస్ పార్టీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీల అక్రమ అరెస్టులు అందుకు నిదర్శనమని ఆమనగల్లు మండల కాంగ్రేస్ పార్టీ అధ్యక్షుడు కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. దేశంలో అప్రజాస్వామిక పాలన కొనసాగిస్తూ, ప్రజాగొంతుకను అణగదొక్కాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని ఆయన ఆరోపించారు. రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ అరెస్టులకు నిరసనగా కాంగ్రేస్ పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు మండల, పట్టణ కాంగ్రేస్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని హైదరాబాద్-శ్రీశైలం ప్రధాన రహదారిపై నిరసన ర్యాలీ చేపట్టి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం రాజీవ్ చౌరస్తాలో బైఠాయించి రాస్తారోకో చేశారు. కాంగ్రేస్ పార్టీ నిరసనతో స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

**మోడీ దిష్టిబొమ్మ దహనానికి యత్నం...**

కాంగ్రేస్ అగ్రనేత రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ చేపట్టిన నిరసన కార్యక్రమం స్వల్ప ఉద్రిక్తతకు దారి తీసింది. నిరసనకారులు ప్రధానమంత్రి నరేంద్రమోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేయడానికి సిద్ధం అవుతున్న తరుణంలో పోలీసులు నిరసనకారుల యత్నాన్ని అడ్డుకున్నారు. దిష్టిబొమ్మను దగ్ధం చేయాలని పట్టుబట్టడంతో పోలీసులు దానిని లాక్కువెళ్ళారు. ఈసంధర్భంగా మండల కాంగ్రేస్ పార్టీ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన మున్సిపల్ చైర్మన్ పత్యానాయక్ మాట్లాడుతూ నీట్ తప్పును ఒప్పుకోవడంలో కేంద్రం తాత్సర్యం చేస్తుందని మండిపడ్డారు. పేపర్ లీక్‌తో లక్షల మంది విద్యార్థులు మనోవేదనకు గురైనారని, విద్యార్థుల డిమాండ్ పట్టించుకోకుండా ప్రధానమంత్రి నరేంద్రమోడీ కుటిల రాజకీయాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రేస్ పార్టీపట్టణ అధ్యక్షుడు అవ్వారి శివలింగం, మాజీ జడ్పిటీసి శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, శంకర్‌కొండ సర్పంచ్ రాములు, కో ఆప్షన్ సభ్యులు అబ్దుల్ ఖాదర్, విజయ్, ఒగ్గు మహేష్, సీనియర్ నాయకుడు ఖాదర్ ఖాద్రి, కాల మల్లయ్య, ఎంగల్ ప్రసాద్, అలీమ్, సూదిని కొండల్‌రెడ్డి, కండెసాయి యూత్ కాంగ్రేస్ అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, ఫరీద్, సురేష్ నాయక్, రఫీ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లులో కాంగ్రేస్ పార్టీ నిరసనలో దిష్టిబొమ్మను అడ్డుకుంటున్న పోలీసులు



హైదరాబాద్-శ్రీశైలం ప్రధానరహదారిపై ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రేస్‌పార్టీ శ్రేణులు





చేగూరులో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ తదితరులు.

ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాటిచార్జి అమానుషం
కేంద్ర ప్రభుత్వం సాగిస్తున్న నిరంకుశ పాలనకు నిదర్శనం
కందుకూరులో కాంగ్రెస్ నిరసన

**కందుకూరు. జులై 22. (ప్రభాతవార్త):**
కేంద్రంలో ఎన్డీఏ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తుందని రాజ్యాంగ స్ఫూర్తిని కాల రాస్తున్నదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, మాజీ జెడ్పిటిసి బొక్క జంగారెడ్డి విమర్శించారు. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నీట్ విద్యార్థులు, సీజేపి నిర్వహిస్తున్న ధర్నా సందర్భంగా జరిగిన లాటి చార్జీకి నిరసనగా కాంగ్రెస్ అధినాయకులు రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీల అక్రమ అరెస్టులను నిరసిస్తూ బుధవారం తెలంగాణ కాంగ్రెస్ పార్టీ పిలుపుమేరకు కందుకూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులు కొర్పోలు రాణా ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించి కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను తగలబెట్టారు. ఈ సందర్భంగా జంగారెడ్డి మాట్లాడుతూ జాతీయస్థాయిలో నిర్వహించిన నీట్ ఎగ్జామ్స్ లీక్ కావడం వలన చాలామంది విద్యార్థుల జీవితాలు దెబ్బతిన్నాయని విమర్శించారు. ఈ విషయమై విద్యార్థులు విద్యార్థి సంఘాలు కేంద్ర ప్రభుత్వ అసమర్ధ తవలన విద్యార్థుల జీవితాలు అన్యాయమైనయని ఈ విషయంలో బాధ్యులైన కేంద్ర విద్యా శాఖ మంత్రి బాధ్యత వహించాలని పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం జరిగిందన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం తమ తప్పును కప్పిపుచ్చుకోవడానికి కుతంత్రాలు పన్నుతూ ప్రజాస్వామ్యయుతంగా విద్యార్థులు నిరసన తెలిపితే దాన్ని అణచివేయాలని క్రూరంగా పోలీసులతో లాటి చార్జి చేయించిందని విద్యార్థినులు అని చూడకుండా వారిపై కర్కశంగా వ్యవరించిందని విమర్శించారు. విద్యార్థులపై జరిగిన లాఠీచార్జిని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ విద్యార్థులకు మద్దతుగా నిలిస్తే కాంగ్రెస్ అధినాయకుల పట్ల క్రూరంగా వ్యవహరిస్తూ అక్రమంగా అరెస్టులకు పాల్పడిందని అది అప్రజా స్వామికమని, ప్రశ్నించే గొంతు కలను నొక్కాలని కేంద్రంలోని ఎన్ డి ఏ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం పనిచేస్తుందని అది ప్రజాస్వామ్య దేశంలో నడవదని హెచ్చరించారు. ఈ విషయంలో విద్యార్థులకు న్యాయం జరిగే వరకూ కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని కేంద్రంలో బిజెపి నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం తమ ఆగడాలను ఆపకపోతే ప్రజా ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. విద్యార్థులపై జరిగిన లాటి చార్జీ కి కేంద్ర ప్రభుత్వం బేషరతుగా క్షమాపణ చెప్పాలని నీట్ పరీక్ష పత్రాల లీకేజీకి బాధ్యతగా కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కందుకూరు సర్పంచ్ సరికొండ పాండు, నాయకులు ఎస్ వెంకట్రాంరెడ్డి, ఎండి అఫ్జల్, జగన్, రామ్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, సురేందర్, కృష్ణా నాయక్, నేచ్యా నాయక్, తోపాటు వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

### కాంగ్రెస్ అగ్రనేతల అరెస్ట్ అప్రజాస్వామికం

**నందిగామ, జులై 22, ప్రభాతవార్త :** ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎంపీ ప్రియాంక గాంధీతో పాటు ఇతర ప్రతిపక్ష పార్టీల నాయకులను అరెస్టు చేసి జైలుకు తరలించడం దుర్మార్గమని నందిగామ మండల మాజీ ఎంపిపి ఏం శివశంకర్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేపల్లె కుమార్ గౌడ్, లు విమర్శించారు. నీట్ విద్యార్థులకు జరిగిన అన్యాయాన్ని ఎండగడితే పాశవికంగా దాడి చేయడం అత్యంత హేయమైన చర్యగా వారు అభివర్ణించారు. యువత భవిష్యత్తు కోసమే రాహుల్ గాంధీ నిరసన తెలిపారని, కాంగ్రెస్ అగ్ర నేతల అరెస్టు ప్రజాస్వాన్ని హక్కులపై దాడి చేయడమేనన్నారు. ఈ సమావేశంలో మాజీ అధ్యక్షులు జంగ నరసింహులు, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు, నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ, చేగూరు సర్పంచ్ మంకాల శ్రీశైలం, ఉపసర్పంచ్ ఆవుల మంద శివశంకర్, నందిగామ ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్, బుగ్గొనిగూడ సర్పంచ్ సాలయ్య, వెంకమ్మగూడ సర్పంచ్ గొర్లపల్లి అశోక్ , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు పసుల బుచ్చయ్య, రేనట్ల సురేష్ గౌడ్ , బుగ్గోని గూడ మాజీ వార్డ్ సభ్యుడు గొల్ల రామచంద్రి, సురేష్ , గాలయ్య తదితరులున్నారు.

## కేంద్రం అరాచక పాలనపై భగ్గుమన్న దౌల్తాబాద్ కాంగ్రెస్ శ్రేణులు..

**-రాహుల్ ప్రియాంక గాంధీలపై దాడికి నిరసనగా ప్రెస్ మీట్**

**దౌల్తాబాద్, జులై 22, ప్రభాతవార్త:**
నీట్ పేపర్ లీకేజీకి పాల్పడుతూ పరీక్ష పత్రాలను విచ్చలవిడిగా అమ్ముకుంటూ కోట్లు సొమ్ము చేసుకుంటున్న కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు, పీఎం నరేంద్ర మోడీ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న విద్యార్థులకు అండగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలపై జరిగిన దాడిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ ఘటనకు నిరసనగా దౌల్తాబాద్ మండల కేంద్రంలో బుధవారంరోజు కాంగ్రెస్ నాయకులు ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ సంధర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ. .దేశంలో నిరుద్యోగ యువత భవితతో చెలగాట మాడుతున్న బీజేపీ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. విద్యార్థుల హక్కుల కోసం ప్రశ్నించే గొంతులపై భౌతిక దాడికి దిగడం కేంద్ర ప్రభుత్వ అరాచక పాలనకు, నియంతృత్వ ధోరణికి నిదర్శనమని వారు మండిపడ్డారు. ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలుపుతున్న తమ నాయకులపై దాడులు చేయడం సిగ్గుచేటని, ఈ దాడులను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని స్పష్టం చేశారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రెడ్డి శ్రీనివాస్, కొటం రాములు, రెడ్యానాయక్, మాధవరెడ్డి, నర్సింములు, నరేందర్ నాయక్, చందర్ నాయక్, మోహన్ నాయక్, మైపాల్, యుద్ధప్ రెడ్డి, రవితేజ, రఫీ, సూర్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



మాట్లాడుతున్న విద్యార్థి సంఘం నాయకుడు

### రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేద్దాం

**చేవెళ్ల, జులై 22, ప్రభాతవార్త :** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన దాడికి నిరసనగా ఈ నెల 24న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించతలపెట్టిన విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఆయా ఆ విద్యార్థి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎన్ ఎస్ యు ఐ చేవెళ్ల మండల కమిటీ సభ్యులు శాంసన్, ఎండీ. సమీరుద్దీన్, ఇర్ఫాన్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా విద్యార్థులపై జరుగుతున్న అన్యాయాలు, ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్, విద్యా వ్యవస్థపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఎన్ ఎస్ యు ఐ, ఎస్ ఎఫ్ ఐ, ఏఐఎస్ఎఫ్, పిడిఎస్ యూ, ఏఐపిఎస్ యూ, ఏ ఐ ఎస్ బి యూ, ఏ ఐ ఎఫ్ డి ఎస్ యు, తదితర వామపక్ష విద్యార్థి సంఘాలతో కలిసి, జూలై 24న తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు శ్రీ రాహుల్ గాంధీ విద్యార్థుల హక్కుల కోసం దేశవ్యాప్తంగా చేస్తున్న పోరాటానికి సంఘీభావంగా, తెలంగాణలోని విద్యార్థులు ఈ బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల గొంతును అణచివేయాలనే ప్రయత్నాలను ప్రజాస్వామ్యబద్ధంగా ఎదుర్కొంటామని అన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఉద్దేశించి ఆయన ఈ క్రింది డిమాండ్లను చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలన్నారు. ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌కు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల ప్రజాస్వామ్య హక్కులను, శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును పరిరక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చేవెళ్ల మండల కామెట్టి సభ్యులు ఎండీ సమీరుద్దీన్, మండల కమిటీ సభ్యులు ఫాద్వ్, అల్తాఫ్, అర్షద్, ఇమ్రాన్, కిరణ్, మనోజ్, ప్రవీణ్ తదితరాలు పాల్గొన్నారు.

### మేడ్చల్‌లో కాంగ్రెస్ శాంతియుత నిరసన

**కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్**

**మేడ్చల్, జులై 22. ప్రభాతవార్త :** నీట్ పరీక్ష లీకేజీకి బాధ్యత వహించి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని నిరసన వ్యక్తం చేసిన కాంగ్రెస్ అగ్ర నేతలను అరెస్టు చేయడం హేయమైన చర్య అన్ని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ అన్నారు. లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేల అరెస్టును ఖండిస్తూ మేడ్చల్ పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నీట్ పేపర్ లీక్ ఘటనకు పూర్తి బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ పేపర్ లీక్ ఘటన దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడిందని, దీనికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా ప్రతిపక్ష నాయకులపై జరుగుతున్న చర్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని అన్నాడు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరి వర్ధన్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్ రెడ్డి, మేడ్చల్, కిష్టాపూర్ పూడూర్, గుండ్లపోచంపల్లి డివిజన్‌ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నడికొప్పు నాగరాజు ముదిరాజ్, రొయ్యపల్లి మల్లేష్ గౌడ్, సురేందర్ ముదిరాజ్, ఎల్లంపేట్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విఘ్నేశ్వర్ రెడ్డి, నాయకులు చీర్ల రమేష్ కురుమ, కొడే మహేష్ కురుమ, బత్తుల మధుకర్ యాదవ్, మర్రి నర్సింహ్మారెడ్డి, నరేందర్ వంజరి, వేముల మహేష్ గౌడ్, బాల్ రెడ్డి, రామన్నగారి రాఘవేందర్ గౌడ్, రంజిత్ ముదిరాజ్, కనకాల శివ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేష్ ముదిరాజ్, బాల మల్లేష్ ముదిరాజ్, సత్యనారాయణ, రమణా రెడ్డి, చిల్ల వెంకటేష్ ముదిరాజ్, మహేష్, సంజీవ రావు, ఆనంద్, కొండల్ రెడ్డి, బర్ల సంతోష్ ముదిరాజ్, ప్రేమలత, మల్లీశ్వరి, వినోద, శ్యామల, రేణుక తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్‌లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్

### విద్యార్థుల హక్కుల కోసం నిరంతర పోరాటం

**షాద్‌నగర్, జులై 22, ప్రభాతవార్త :** ఢిల్లీలో నీట్ పరీక్ష వివాదం, విద్యార్థులపై జరిగిన పోలీసుల లాఠీఛార్జీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి రాజ్‌భవన్ వరకు నిర్వహించిన ధర్నాలో షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ పాల్గొని మాట్లాడారు. ఈ ధర్నా కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, పలువురు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన నీట్ పరీక్షల్లో అవకతవకలు, ప్రశ్నపత్రాల లీకేజీ వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం ఎంతో కష్టపడి పరీక్షలు రాస్తున్నారని, అలాంటి పరీక్షల్లో అక్రమాలు చోటుచేసుకుంటే వారి జీవితాలు తీవ్రంగా ప్రభావితమవుతాయని అన్నారు. విద్యార్థులు తమ న్యాయమైన సమస్యలపై ప్రశాంతంగా నిరసన వ్యక్తం చేస్తే వారిపై లాఠీఛార్జీ చేయడం, పోలీసుల బలప్రయోగానికి పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వీర్లపల్లి శంకర్ అన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం వారిపై అణచివేత చర్యలకు పాల్పడటం సరికాదన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీ, పరీక్షల నిర్వహణలో అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ వారి పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.